# పంచపాత్ర

## శ్రీ కె. ఎస్. వి. నరసింహం

నవల రాద్దామని కూచున్నాను.

తలుపు చప్పుడు.

"ఎవరూ ?"

జవాబులేదు.

ఆశ్చర్యపోయేను.

ఇంకా సరీగ్గా తెల్లవారలేదు. చలిచలిగావుంది. మంచు కురుస్తోంది. ఈవేళప్పుడు నాగది కొచ్చేదెవరు ?

మళ్ళీ తలుపు చప్పుడు.

"ఎవరది ? –" అన్నాను మళ్ళీ. కలం మూసి పక్కన పెట్టేను. గుమ్మంవేపు చూసేను.

తలుపు వేసుంది గాని, గడియవేసిలేదు.

తలుపు తట్టిన వ్యక్తి తలుపునెట్టి లోపలికి రావొచ్చుగదా ?

"కమిన్ ప్లీజ్ !..." అన్నాను.

మరుసటి క్షణంలో తలుపు తెరుచుకుంది.

ఆరడుగుల భారీ మనిషి వొకాయన లోపలికి జొరబడ్డాడు.

"ఆనందరావు మీరేకదూ ?–"

అవునన్నాను.

"రచయిత ఆనందరావు-"

ఏం చెప్పాలో తోచలేదు. సరే–ఆమాటని దాటేస్తూ–

"మిమ్మల్ని నేనిదివరకెక్కడా–" అని అర్థోక్తిలో ఆగేను.

"చూశ్చేదులెండి-" అన్నాడాయన. నాటకీయంగా మూడడుగులు ముందుకొచ్చి – వొకడుగు వెనక్కి వేశాడు – "నేను – మీ పాత్రని–" అని నవ్వేడు.

ఆలోచనలో పడ్డాను.

"ఆశ్చర్యపోతున్నారా ?–" అన్నాడాయన.

లేదని ఆయనకి తెలుసని నాకు తెలిసింది.

మేజామీది కాయితాలకేసీ కలంకేసీ సాభిప్రాయంగా చూసేడు,

"కొత్త నవలా ?–" అన్నాడు.

"నవల–అంటే కొత్తదనే అర్థం–" అన్నాను గడుసుగా.

"దానికేముందిలే - నవల అంటే – ఆడది అనికూడా అర్థం వుంది" అన్నాడాయన.

నా పాత్ర అని చెప్పుకునే ఆయనముందు వోడిపోవడం నా కిష్టంలేదు. "నిలబడే వుండిపోయేరు–కూచోవొచ్చునే–" అన్నాను కుర్చీ చూపిస్తూ.

"నేను కూచోవడానికి రాలేదు" (సినిమా డైలాగు)

"నించోవడానిక్కూడా రాలేదు కదా ?-"

"నవల రాస్తున్నారుకదా ! – నామీద రాస్తారేమోనని వచ్చేను –"

"నేను నవల రాస్తున్నట్టు మీకెలా తెలిసింది ?–"

"మర్చిపోకండి – నేను మీ పాత్రని–"

ఆయనకి నడివయస్సెప్పుడో దాటింది. చెవులదగ్గిర వెంట్రుకలు తెల్లబడుతున్నాయి. కనుబొమలుకూడా పల్చబడుతున్నాయి. ముదురు నీలంరంగు సూటులో చాలా హుందాగా వున్నాడాయన. ఖరీదైన తండ్రి పాత్రకి సరిపోయేలా వున్నాడు.

"మీరు నన్ను మీరనకండి–బావులేదు–"అన్నాను సవినయంగా.

ఆయన సంతోషించినట్టు కనిపించేడు, నవ్వేడు.

"కూచోమంటే కూచోలేదు మీరు – మీ పేరేమిటోకూడా చెప్పలేదు–" అన్నాను.

"అబ్బాయ్ ! –" అన్నాడాయన. ఆగి నవ్వేడు, సాభిప్రాయంగా.

"అలాగే పిలవండి" అన్నాన్నేను – వినయాన్ని కొనసాగిస్తూ.

"- నేను నీ పాత్రని–" అన్నాడాయన మళ్ళీ - "నా పేరేమిటో నువ్వే చెప్పాలి–" అన్నాడు.

"నీలకంఠంగారు" అన్నాను.

"కాదు-"

"రంగారావుగారు-"

"అబ్బే-"

"నాగభూషణరావు-"

"నో నో-"

"సరే ఆఖరిపేరు-ఇది తప్పడానికి వీల్లేదు - రఘునాథ రామయణంగారు-"

గల్లున నవ్వేడాయన.

"రైటేనా?-" అన్నాను.

"రైటైతేనే నవ్వుతాగేం? ఇదుగో ఆనందరావ్!... నువ్వేం రచయితవయ్యా?..." అన్నాడాయన.

తూరుపు తెల్లవారిపోతోంది. పిల్లగాలులు కిటికీలోంచి చల్లగా వొస్తున్నాయి. బోగన్ విలియాలు తమాషాగా నవ్వుతున్నాయి.

మౌనంగా సిగిరెట్టు తీసి వెలిగించి పొగవదిలి అగంతకుళ్ళా ప్రవేశించిన నా పాత్రవేపు చూసేను.

"సిగిరెట్లు తాగేవాళ్ళంటే నాకు పడదు-" అంటూ కోటు జేబులోంచి పైపుతీసి అతిప్రయత్నంమీద వెలిగించి గుప్పు గుప్పుమని పొగ వదిలేడు. "ఇదుగో ఆనందరావ్!...కోపమొచ్చిందా?-"

"అబ్బే!- నాకు కోపమెప్పుడూ రాదండీ-"

"గుడ్! కాని-కోపం ఎందుకురాదు?"

"నా పాత్రలమీద కోపం తెచ్చుకోవడానికి నేనెంతటివాణ్ణండీ? అఫ్ట్రాల్ వొక రచయితగాణ్ణి-అంతేగా?-"

"అదేవిటలా అంటావ్? నీ పాత్రలంటే ఏవిటి? నీ సృష్టేగా?-"

"ఏం లాభం? రచయితగా పేరు నాది, అంతే! కాని, కథో? కథంతా పాత్రలదేగా? కథలో మాట్లాడేదీ పాత్రలే! నడిచేదీ పాత్రలే! నవ్వడం, యేడవడం, ప్రేమించడం, త్యాగాలు చెయ్యడం, కన్నీళ్ళు కార్చడం-అంతా పాత్రలపనంతే! నాదేముంది? కేవలం నిమిత్త మాత్రుణ్ణి-"

"నమ్మమంటావ్?-"

"నమ్మి చెడినవాడులేదు ఉదాహరణకి మిమ్మల్నే, తీసుకోండి-నేనేదో పొద్దున్నేలేచి స్నానం గీనం చేసి బుద్ధిగా నవల రాసుకుందామని కాగితాలు ముందేసుక్కూచున్నానో లేదో-వొచ్చి తలుపు తట్టేరు మీరు సరే. ఎవరు మీరంటే నా పాత్రన్నారు. ఇహ నేను రాసేదేముంది? కథ నడపాల్సింది మీరే!-"

"కథ నడపడానికి రాలేదు నేను-కథ చెప్పడానికొచ్చేను-"

"ఆ రెండింటికీ అట్టే తేడాలేదు లెండి. కథ చెప్పడాన్నే కథ నడపడం అని కూడా అంటారు-"

"ఫరవాలేదు నువ్వు మరీ అంత మందమతివికావు-" అన్నట్టు చూసేడాయన.

"పెద్ద కథా-నవలా మీది?-" అన్నాను.

"నా పేరు ధనపతి-" అన్నాడాయన నా కెదురుగా కుర్చీలో కూచుంటూ.

"నా ప్రశ్న-" అన్నాను.

"సరే నాది పెద్ద కథాకాదు, నవలాకాదు, చిన్నకథ కూడా కాదేమో" అన్నాడాయన, ధనపతి.

శూన్యంగా చూసేను.

"అయినానేనో పాత్రని-" అన్నాడు మళ్ళీ.

"కథలోకి గాని పెద్ద కథలోకిగాని నవలలోకి గాని-వేంట్లోకి రాకుండా పాత్రలెలా వుంటాయి?-" అన్నాన్నేను.

"కథల్లోకీ నవలల్లోకీ రాకుండా జీవితంలో చాలా పాత్ర లుంటాయి. పాత్రలంటే పుట్టిన పాత్రలు-అంతే-!"

"బాబోయ్! మీరు జీవితంలో పాత్రా? మిమ్మల్నెక్కడా చూడలేదని మొదట అన్నానుగాని-ఎక్కడో చూసినట్టు ఇప్పుడు అనుమానం వొస్తోంది-"

"బన్కమ్-" అన్నాడాయన శుద్ధంగా. చెప్పొద్దూ, ఆయన ముదురు నీలిరంగు సూటు వచ్చిందిగాని, ఆ నాటు యాస ఇంగ్లీషు మాత్రం నాకుససేమీ నచ్చలేదు. "నేను జీవితంలో పాత్రనీ కాను. కథల్లో నవలల్లో పాత్రనీ కాను. నువ్వు నన్ను ఇంతకు మునుపెప్పుడూ - కలలో కూడా-చూసి వుండవు-" అన్నాడాయన, ధనపతి. ఏవిటో-ఆయనపేరు వింతగా వుంది. "నేను నీ పాత్రని-పుట్టని పాత్రని! ప్రస్తుతానికంతే! కాని, నువ్వేదో నవల రాయాలనుకుంటున్నావుగదూ?-కావలిస్తే నాగురించి రాయొచ్చు. రాస్తావేమో కనుక్కుందామనే-ఇంత ప్రొద్దున్నే బైల్దేరొచ్చేను-"

"లేటుగా- పూర్తిగా తెల్లారింతర్వాతొచ్చినా- నేనేం పారిపోను గా-"

"నువ్వు పారిపోవు. కాని, నా బుద్ధి మారిపోవొచ్చు-"

గంటకోసారి మారే బుద్ధి అదేంబుద్ధి – అందామనుకున్నాను. ఎందుకులే పెద్దవాడని అనడం మానుకున్నాను.

"సరే-ఇంతకీ యేమంటావు? -" అన్నాడు ధనపతి.

"ఏమిటి ఏమనడం?–" అన్నాను-బ్లాటింగ్ పేపర్ వెనక వేపు "ధనపతి - ధనపతి" అని రాస్తూ,

"అదే-నామీద నవల-"

"చెప్పండి మరి–"

"ఏం చెప్పను?–"

"ఏమైనా చెప్పండి-"

"ఏం చెప్పినా రాస్తావా?-"

"ఏం చెప్పినా వింటాను–"

"మరి రాయడం?–"

"రాస్తే రాస్తాను–"

"రాయక పోతే?–"

"రాయను–"

ధనపతి పైపు ఆరిపోయింది. విశ్వప్రయత్నంమీద మళ్ళీ వెలిగించుకున్నాడు. ఆలోచిస్తున్నాడు. చెప్పనా - వద్దా–అని కాబోలు. లేదా, ఏం చెప్పను?–అని కాబోలు. చివరికి తేరుకున్నాడు. గుప్పగుప్పున పొగవదిలేడు. "చెప్పడానికేంలేదు. ఏదేది నోటికొస్తే అదల్లా చెప్పేస్తాను-బోరుకొట్టినాసరే – నువ్వు విని తీరాలి–" అన్నాడు ధనపతి.

"మీ గురించి మీరు చెప్తే వినాలనుంది. చెప్పండి, వింటాను. ఎందుకోగాని నా కిష్టమైనవి వింటే అనుకోకుండా నిద్రొచ్చేస్తుంది. మధ్యలో నిద్రపోతే లేవగొట్టే పూచీ మీదే-" అన్నాను.

"అలాగేలే ! నువ్వు నిద్రపో చూద్దాం-లేవగొడతానో–కొడతానో నీకే తెలుస్తుంది -" అన్నాడాయన, ధనపతి, ఇన్స్పిరేషన్ కోసం పైపు చప్పడయేలా పీలుస్తూ.

నేను కొత్త సిగిరెట్టు వెలిగించి "మరింక చెప్పండి" అన్నట్టు కూచున్నాను.

ధనపతిగారిలా చెప్పేడు :

ముందే చెప్పేనుగా – ప్రత్యేకంగా చెప్పడానికంటూ నా జీవితంలో ఏం లేవు. నాజీవితం జీవితమే. చిన్నకథాకాదు, పెద్దకథా కాదు, నవలాకాదు, నాటకమూకాదు. నా జీవితంలో నవరసాలు లేవు. వున్న దొక్కటేరసం, నీరసం. రసవంతంగా రాయాలని ఎవరైనా అనుకుంటారు, నీరసవంతంగా రాయాలని ఎవరైనా అనుకుంటారా ? ఎవరి సంగతో ఎందుకు ?–పోనీ--నువ్వనుకుంటావా?–

అదుగో-నీ ముఖంలో అప్పుడే చికాకు బయలుదేరుతోంది – ఉపోద్ఘాతం మొదలెట్టేనని కదూ ? ఉపోద్ఘాతాలంటే పాఠకులకెలాగూ ఇష్టం వుండదు ! రచయితలక్కూడా అట్టే ఇష్టమేం వుండదని ఇప్పుడిప్పుడే తెలుస్తోంది. సరే – ఆగాను – నాగురించే చెప్తాను.

అవును, నాపేరు ధనపతి. అంటే నీకు తెలుసు, నిజంగా కూడా నేను ధనపతినే! మీవూరికీ మావూరికీ అరవైమైళ్ళపైనే వుంది దూరం, వూరిపేరు నేను చెప్పను. గెస్ చేసి నువ్వు తెలుసుకున్నా – వొద్దు – నాకు చెప్పకు. మా వూళ్ళో నాకో పెద్ద ఫ్యాక్టరీ వుంది. ఏం ఫ్యాక్టరీ అని అడక్కు–ఫ్యాక్టరీ-అంతే !

విదేశీ బ్యాంకుల్లో కూడా ఖాతాలున్నాయినాకు. ఇహ స్వదేశీ బ్యాంకుల సంగతి చెప్పనవసరం లేదుకదూ ?

బోలెడన్ని కార్లున్నాయి. బంగళాలున్నాయి. పుండీ మార్బలం వుంది. సంఘంలో గౌరవ మర్యాదలున్నాయి. అసెంబ్లీలో పలుకుబడి చాలావుంది.

పేరేకాదు నేను అక్షరాలా వాస్తవంగా ధనపతినే!

మనిషి భూమ్మీద సుఖపడడానికి కావలసిన హంగులన్నీ నాకు పుష్కలంగా వున్నాయి –

అయినా రాత్రింబవళ్ళూ వారంలో ఏడుదినాలు, నెలలో ముప్ఫై (ముప్ఫై యొక్క) దినాలూ, సంవత్సరం పొడుగుతా – నేను క్షణం క్షణం కోరుకుంటూవుండే అమూల్య అపురూప వస్తువొకటుంది – వొకే వొకటి-అనంత ధనరాసులైనా నా కందివ్వలేని గుప్పెడంత వస్తువు – నిజానికి వస్తువూకాదు–ఏమిటనుకున్నావు అది –

"వ్ !"- అన్నాను, అప్రయత్నంగా.

ఆగిచూసేడు ధనపతి. "ఏమిటి ?-" అన్నాడు.

"మీ క్కావలసిన ఆ గుప్పెడు వస్తువు-వస్తువూకాదు పొడు

కాదు అది-మనశ్శాంతేగా ?–" అన్నాను, మినిషేవర్ షెర్లక్
హోమ్స్ లాగా.

"హుం–" అన్నాడు ధనపతి.

దానర్థం నాకు బోధపడలేదు.

" "హుం–" అంటే ఏమిటండీ ?–" అన్నాను, ఎంతో
కొంత అమాయకంగానే ?

"సరేలే–నేన్నిలాగా కథకుణ్ణి కాను –" అన్నాడు. "ఇంతకీ
కథ వింటావా వినవా ? –" బెదిరించేడు.

"కథాకాదు నవలాకాదు–అని ఇందాకా దబాయించేరే ! ?–"

"అప్పుడు కాదు, ఇప్పుడు ఔను, నా జీవితం, నాయిష్టం.",

"క్షమించండి, తెలీకేదో అన్నాను. మరింక చెప్పండి. మీకు
కావలసింది గుప్పెడు మనశ్శాంతి–మనశ్శాంతి–అంతే కదూ ?–"

"అవును–మనశ్శాంతే !–" అన్నాడు ధనపతి.

అవును, మనశ్శాంతి కావాలి నాకు, మ–న–శ్శాం–తి !–
ఎవరిస్తారు నాకు మనశ్శాంతి? కార్లూ, బంగళాలూ, బిజినెస్, మీటిం
గులూ, పెద్ద పెద్ద పార్టీలూ, ఖరీదైన కోట్లతో షేక్ హేండ్లూ,
బ్యాంక్ ఖాతాల్లో నెలనెలా పెరిగే నాడ్డీలూ–ఇవన్నీ కలిసి నాకు ఏమి
స్తాయి చెప్పూ ? – ఓహో! సంఘంలో పలుకుబడి, వెళ్ళిన చోటల్లా
ధనపతిగారికి జై ! వెళ్ళని చోటినుంచికూడా ధనపతిగారికి జైయ్యే !

జీవితంలో సక్సెస్‌తో విసుగెత్తిపోయేననుకోకు ! ఈ సక్సెస్
అంతా కలిసినా నా కొక్కపూట మనశ్శాంతి అయినా ఇవ్వలేదే అని
బాధ. సుఖశాంతులు–అని ద్వంద్వ సమాసం వాడతారే–సుఖమైతే
గాగోలాగా సంపాదించుకోవొచ్చు–కాని, శాంతిని పొందడమెలాగ?–

"అలిసిపోయినట్టున్నారు – కాఫీ తీసుకోండి –" అన్నాను,
ధనపతిగారిని మధ్యలో ఆపి.

(నా గదిలో నేను తప్ప ఇంకెవరూ ఉండరు. కాని, నాకేది
కావాలన్నా వెంటనే తయారై వొస్తుంది. ఎలా వొస్తుందో నాకు
తెలీను. (ప్రయత్నిస్తే ఎవరికైనా తెలుస్తుంది. ఎవరికీ రాకపోవచ్చు,
, ధనపతిగారికోసం నేను కాఫీ తెప్పించేను.)

"బావులేదా నాకథ ?–" అన్నాడు ధనపతి, కాఫీసిప్ చేస్తూ.

"కాఫీ ఎలావుంది ?–" అన్నాను.

"ఫైన్ !–" అన్నాడాయన.

"మీ కథమాత్రం చప్పగావుంది. చెప్పాలేదు" అన్నాను.

"చెంపో ? చెంపోకేం ? – కావలసినంత తెప్పిస్తాను. నీకు
పూసిరాడదేమోనని నా భయం. కాసుకోమరి–" అన్నాడు ధనపతి.

క్షణంలో ఆయన భంగిమ మారిపోయింది. తాగుతూన్న
కాఫీ సగంలో ఆపి కప్పు టేబిల్ మీద పెట్టి, జేబులోంచి వొక చిన్న
సీసా బైటకి తీసేడు. అందులోంచి రెండు మాత్రలు తీసి నోట్లో
వేసుకుని గుటుక్కున మింగేసేడు. మిగిలిన అరకప్పుకాఫీకూడా
చక్కగా వొక్క గుక్కలో ఫినిష్ చేసేసేడు కూచున్న కుర్చీలోనే
వెనక్కివాలి తల వెనక్కి వేళ్ళాడేసి రిలేక్స్ అయేడు! ఆయన
ముఖమ్మీద ముమ్మరంగా చెమటలు పోయుండడం చూసి గాభరాపడి
పోయేను. తొందరంగా లేచి ఫేన్ స్విచ్ ఆన్‌చేసి రెగ్యులేటర్ ఫుల్‌లో
పెట్టేను. ఆయన ఇంకా అవస్థపడుతూనే వుండడంమూసి ఏదో
ఆపదే అనుకుని – ముందు ఆయన నెక్ టై వదులుచేసేను,
'అబ్బా! –" అన్నాడు ధనపతి.

"ఏమైందండీ ?..."

"హుం–"

"డాక్టరుగ్గాని ఫోన్ చెయ్యమంటారా? –"

"వూం హుం–"

"మీ వాలకం చూస్తుంటే నాకెందుకో భయంగా వుంది–"

దీనంగా చూసేడాయన నావేపు. ఎవరో పాత పరిచయస్థుల్ని
చూసి నవ్వినట్టు నవ్వేడు. ఆ నవ్వు చాలా విచిత్రంగా వుంది.

"ఆనందరావ్!..."

"చెప్పండి ఎందుకలా అయిపోయేరు హఠాత్తుగా..."

"హుం–" నవ్వేడు. తేరుకున్నాడు. నవ్వి తేరుకోవడం అల
వాటు కాబోలు. కుర్చీలో మామూలుగా కూచున్నాడు.

"ఆనందరావ్! నాకు గుండె జబ్బుందని నీకు తెలీదు–గుండె
జబ్బు చాలా ఖరీదైన జబ్బు–మాలాంటివాళ్ళకే వస్తుందది. నాకే
వొచ్చింది...అబ్బా!......"

"మాత్రలు వేసుకున్నారూ..."

"వేసుకోవాలి...ఆ క్షణానికి ఆ మాత్రలు వేసుకోకపోతే...
అంతే...నా ఫ్యాక్టరీ నా కార్లూ నా సిరిసంపద ఏవీ నన్ను రక్షించలేవు...
ఇంత పెద్ద ధనపతి గుండెకాయని రక్షించే సాధనాలేవో తెలుసా?–
ఇదుగో–ఇంత చిన్న మాత్రలు......"

పేలవంగా నవ్వేను. అంతకన్నా ఏం చెయ్యగలను?

"ఈ బతుకింతే ఆనందరావ్!" అన్నాడు ధనపతి–"ఇహ బాగుపడదు–పడనే పడదు–"

"డాక్టర్లు మీకు చెప్పే వుంటారు–మీరు బాగా రెస్ట్ తీసుకోవాలి - అనవసరంగా ఎక్సయిట్ కాకూడదు–" అన్నాన్నేను, నాను భూతిలో జాలిని కూడా రంగరించి.

ధనవంతులకేం కష్టాలన కుంటాం.

ఎంతచెట్టు కంతగాలి !

"అనవసరంగా ఎక్సయిట్ అవుతున్నానని ఎందుకనుకోవాలి ? అవసరంగానే ఎక్సయిట్ అవుతున్నానేమో!..."

"అదేవిటి ?..."

"అవును–ఆనందరావ్! అనుభవించడానికి అన్నీ వుండి కూడా ఎంత అశాంతిలో అలమటిస్తున్నాన్నేను!–"

"అంటే–మీ స్వవిషయాలు...అంటే - అంటే "

"చెప్పడానికి నాకులేని మొహమాటం అడగడానికి నీకెందుకూ? చెప్తాను–నువ్వు రాసినా రాయకపోయినా సరే నీకంతా చెప్తాను–"

ఎదురు చూడని మలుపు.

ధనపతి జీవితం వెనక ఏయే అగాధాలున్నాయో ! ?

శ్రద్ధగా కూచున్నాను.

కర్చీఫ్‌తో నుదుటిమీది చెమటలు వొత్తుకుని కథా కథనం పునఃప్రారంభించేడు ధనపతి –

–ఎవరికీ తెలీదు నా అశాంతికి కారణం. ఎవరికీ తెలీదు నా నిజస్వరూపం. పెద్దమనిషినే. కాదన్ను, కాని ప్రతి పెద్దమనిషి లోనూ ఏదో వొక చిన్నబుద్ధి వుంటుందనిపిస్తుందినాకు, చెప్తాను, చెప్తాను.

నా కుటుంబం గురించి ఏమీ చెప్పలేదు కదూ నీకు ? ... ఫేక్టరీ పెట్టేందుకు నాలుగేండ్ల క్రితం పెళ్ళిచేసుకున్నాన్నేను, ఇష్టంలేని పెళ్ళి. నాకూ ఇష్టంలేదు, ఆవిడకూ ఇష్టంలేదు. అయినా మా యిద్దరికీ పెళ్ళయింది. ఎలా అయిందని అడక్కు. ఎవరికీ ఇష్టంలేకున్నా భూమ్మీద ఎన్నో జరిగిపోతున్నాయి. అలాగే ఇదీని. ఇష్టానిష్టాల సంగతికూడా వొదిలెయ్యి. ఇంకోటుంది. ఎలాగో–ఒకటి జరుగుతుంది, దానివల్ల మరోటి. నీటివల్ల తప్పని సరిగా వేరొకటి జరిగిపోతుంది. చివరికిచూస్తే జీవితం వైరాసు పతిలా కనిపిస్తుంది. వైరాసుపతే ఎందుక్కావాలి ? జీవితం వొక ఫ్యాక్టరీ ఎందుక్కాకూడదూ ? సరే – ఉపమానం ఏదైతేనేంలే !...

ఆ పెళ్ళివల్ల కాకపోతే నేను ఫ్యాక్టరీ పెట్టేవాణ్ణికాదు, లాభాలు తీసేవాణ్ణికాదు, లక్షలు గడించేవాణ్ణికాదు. నాకు సంఘంలో ప్రతిష్ఠ ఇంతగా పెరిగేది కాదు. ఆ పెళ్ళే జరిగుండకపోతే కళా నా కొడుకయ్యేవాడుకాడు ! ... ...

అవును, నీమాపువల్లే తెలుస్తోందినాకు, వొక్క కొడుకేనా అని అడుగుతావు కదూ ? అవును. వొక్క కొడుకే. వొక్కడే కొడుకు. వాళ్ళమ్మంటే నాకు ఎప్పుడూ ఇష్టం లేదు. అఖిలాదేవి – ఆమె పేరు. వూఁహూఁ – అబద్ధాలు చెప్పనులేను. అందం, గుణం, చదువు–సంస్కారం ధనం–ఆవిడకేవీ తక్కువకావు. కాని ఆవిడంటే నాకిష్టంలేదు. ఎందుకో ఎప్పుడూ అర్థంకాదు. ఇష్టం తెచ్చుకుందామన్నా వీలుపడలేదు. నాకావిడంటే ఇష్టంలేదు సరే – ఆవిడకి నేనంటే అభిమానం వుండొచ్చుగదా ! – వూఁ హూఁ – అదీలేదు. ఇద్దరం ఇద్దరమే! సమాంతరాలు అనంతంలో కలుస్తాయని గణితంలో సిద్ధాంతం. నేనూ అఖిలామాత్రం అనంతంలోకూడా కలవం !......

కళా పుట్టేడు, వాడు అఖిలనూ నన్నూ కలపలేదు. కాని ఎప్పటికప్పుడు – మరీ దూరమైపోకుండామాత్రం వుంచేడు. కళా పూర్తిపేరు చంద్రకళాధర్. వాడు నా కొడుకుకాదు. నా ప్రాణం. అఖిలకు విడాకులిచ్చెయ్యాలని అనుకున్నాను, కాని ఇవ్వలేదు. ఎందుకు ? కేవలం కళావల్ల. కళకి తల్లంటే ఇష్టం. తండ్రంటే ఇష్టం లేదా ? ఎందుకులేదు ? నేనన్నా ఇష్టమే వాడికి ! అఖిలకి నేనంటే అసహ్యం, కాని కళావల్లే ఆ అసహ్యాన్ని పూర్తిగా ఎప్పుడూ బయటపెట్టేది కాదు.

ద్వేషంలోపుట్టిన కళా ప్రేమించడం మొదలు పెట్టేడు – తల్లినీ, తండ్రినీ !

వాడివల్ల నా జీవితానికి వొక రకమైన తృప్తి లభించింది.

కాని, చెప్పేనుకదూ ? పెద్దమనిషినైన నాలో చిన్నబుద్ధి మొగ్గలు వెయ్యడం ప్రారంభించింది.

తల్లినీ తండ్రినీ మాత్రమే ప్రేమించలేదు కళా. ప్రపంచాన్నంతటినీ ప్రేమించేడు. ఒకర్నో ఇద్దర్నో ప్రేమించడం ప్రేమించడం కాదనీ, ప్రేమికుడికి అవధులులేవనీ అప్పుడు నాకు తెలీదు. ద్వేషంతో ధనాన్ని హెచ్చించడం తెలుసుకున్న నాకు ప్రేమంటే ఎట్లాంటిదో తెలిసే అవకాశం ఎక్కడ ?

అవును. కళా ప్రేమించేవాడు. ఫ్యాక్టరీని నేను ప్రేమిస్తే, ఫ్యాక్టరీ వర్కర్లని తాను ప్రేమించేవాడు. డబ్బును ఇనప్పెట్టెలో పెట్టి నేను ప్రేమిస్తే పాకెట్ మనీగా నేనిచ్చిన వందలూ వేలూ అడిగిన వాడికల్లా లేదనకుండా ఇచ్చేసి "నా దగ్గిర డబ్బుంది కాబట్టి

ఉన్నాను - అవసరానికి వినియోగ పడడానికేగా డబ్బు-" అని, ప్రాణంలేని కరెన్సీ నోట్లని ఆ రకంగా ప్రేమించేవాడు కళా, చిన్న పిల్లల్ని ప్రేమించేవాడు, స్నేహితుల్ని ప్రేమించేవాడు, జీవితంలో దెబ్బతిన్నవాళ్ళని ప్రేమించేవాడు, దౌర్భాగ్యుల్ని, దీనుల్ని, హీనుల్ని అందర్నీ ప్రేమించేవాడు !

"ఇంతకీ కళాధర్-అదే చంద్రకళాధర్‌తో మీకు పేచీ ఎందు కొచ్చినట్టు ?-"

'నాకా ? పేచీయా ?" అగి నవ్వేడు ధనపతి.

"ఏమో ! కళాతో నాకు పేచీ వొచ్చిందో- కళాకి నాతో పేచీ వొచ్చిందో నా కిప్పటికీ సరిగ్గా పూర్తిగా అర్థం కావడంలేదు"

"ఎవరితో-ఎవరికి అయినా... పేచీ మాట అబద్ధం కాదు కదా.?"

"కాదు."

"అయితే అదెందుకొచ్చినట్టు ?"

ధనపతి నావేపు చూసేడు, లోతుగా, వెదుకుతున్నట్టుగా. చూసి నవ్వేడు మళ్ళీ యిలా చెప్పేడు—

కారణాలు కావాలి నీకు. ఏది జరిగినా అలా ఎందుకు జరిగిందో కారణం చెప్పాలి. జరిగిందానికి కారణం, జరగని దానికి కారణం, పేచీ వొచ్చినా కారణమే! పేచీ రాకపోయినా కారణమే! అయిన దానికీ కానిదానికీ ప్రతి చిన్న విషయానికీ కూడా కారణం చెప్పమంటావు నువ్వు. నువ్వేకాదు; ప్రపంచమే అంత. కొన్నిటికి కారణాలుండవు, ఉన్నా తెలిసే కారణాలు కావు, తెలిసినా చెప్పేవికావు, చెప్పినా నమ్మేవి కావు......

దగ్గుతో ఆయాసపడుతూ ఆగేడు ధనపతి. మంచినీళ్ళు అందించేను. గటగటా తాగేసేడు.

"థేంక్స్!"

(ఇంకా వుంది)

# రాత్రులు

## శ్రీ దిలావర్

చుక్కల పూల కుప్పలు మోసుకొస్తున్న
మబ్బుల తెప్పలను
సుతారంగా తాకే వెన్నెల కెరటాలతో—
కొమ్మల చంక దిగి
పూరెమ్మల గుండెల్లోకి దూరి
గుస గుసలాడే పిల్ల తెమ్మెరలతో—
లోకాలను మత్తులోకి జోకొడుతూ
కొండల కోనల గుండెల్లో స్పందిస్తూ
నిశ్శబ్దం శబ్దించే
మృదుల సంగీతం తో-
చీకటి చీరలు విప్పి
అమవసగట్టు మీద వేసి
హిమజలపాతంలో
నగ్నంగా జలకాలాడే
ఆమని లేమలతో—
సుసంపన్నమైన యీ నిశీధులు
ఏ రసవత్ కావ్యాలను తమలో దాచుకున్న,
ఏ రమ్యమైన కలలను సొంతం చేసుకున్న,
అతిలోక సౌందర్య నిధులు....?
అందుకే—
ప్రతిరేయి ముందూ గుండెలు చాపుతున్నాను
ఓ గుప్పెడు మధుర కవితలు దానం చెయ్యండని !
ప్రతిరాత్రికీ రిక్తనేత్రాలు చూపుతున్నాను
ఓ పిడికెడు కలలు ప్రదానం చెయ్యండని !